నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 1 ఫిబ్రవరి 2025 | HYDERABAD

## తులం బంగారం ఎప్పుడిస్తరు?: ఎమ్మెల్యే మర్రి

నేరేడ్‌మెట్, జనవరి 31 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం ఎప్పుడిస్తారని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం మల్కాజిగిరి మండల తహసీల్దార్ కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తులం బంగారం కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని. ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాది దాటినా..ఇవ్వడం లేదని మండి పడ్డారు. చేతకాని ప్రభుత్వాన్ని గద్దె దింపేంత వరకు పోరాట చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.


లబ్ధిదారులు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్

ట్రాఫిక్ పల్స్..!



సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ఏ జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్ ఉందో తెలుసుకుని, ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా దానికి ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లేలా ముందస్తు సమాచారాన్ని పొందేలా సరికొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు సైబరాబాద్ పోలీసులు. ఇందులో భాగంగానే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 'ట్రాఫిక్ పల్స్' వ్యవస్థను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ డెవిస్ జోయల్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు.

# ఓవర్‌లోడ్‌కు మీరే బాధ్యులు

### ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ఒత్తిడి!

**అధిక భారమంటున్న విద్యుత్ వినియోగదారులు**

**ప్రత్యామ్నాయంపై దృష్టిపెట్టని ఎస్పీడీసీఎల్**

సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని రామంతాపూర్ ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్ గతంలో నిర్మించారు. అందులో ఎనిమిది ఫ్లాట్లు ఉన్నాయి. అపార్ట్‌మెంట్ నిర్మించినప్పుడు తొమ్మిది మీటర్లు ఏర్పాటు చేస్తే లోడ్ సరిపోయింది. కానీ పెరుగుతున్న అవసరాల దృష్ట్యా వినియోగం పెరిగి 20 కిలోవాట్లు దాటినట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు నోటీసు జారీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలంటూ సూచించారు. కానీ ఇప్పటికిప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలంటే మూడు నుంచి నాలుగు లక్షల వరకు ఖర్చు వస్తుంది. దీంతో యజమానులు తలపట్టుకుంటున్నారు. అయితే రెండు నెలల కిందటే నోటీసులు జారీ చేసినా.. తాజాగా కరెంట్ ట్రిప్ అయితే కష్టమంటూ సిబ్బంది వచ్చి చెప్పడంతో సతమతమవుతున్నారు. మీటర్లు అప్‌గ్రేడ్ చేయాలని అడుగుతున్నప్పటికీ ట్రాన్స్‌ఫార్మరే పెట్టుకోవాలని లేకుంటే సప్లైలో ప్రాబ్లమ్ వస్తుందంటూ పరోక్షంగా హెచ్చరిస్తున్నారని ఫ్లాట్ల యజమానులు చెప్పారు. బిల్డర్‌తో విద్యుత్ సిబ్బంది కుమ్మక్కై మీటర్లు ఏర్పాటు చేయడం వల్లే ఇప్పుడు సమస్య వచ్చిందంటూ ఆగ్రహిస్తున్నారు.



**10 సర్కిళ్ల పరిధిలో..**

గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్ల పరిధిలో సుమారు 1.85 లక్షల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటిపై చాలా చోట్ల ఓవర్‌లోడ్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో కరెంట్ సరఫరాలో సాంకేతిక సమస్యల వల్ల అంతరాయం కలగకుండా దక్షిణ డిస్కం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. ప్రతి ఎలక్ట్రిక్ పోల్, ట్రాన్స్‌ఫార్మర్‌ను జీపీఎస్‌తో అనుసంధానం చేసి వాటిపై ఎంతలోడ్ ఉందనే వివరాలను ఎంటర్ చేశారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో మొదట గ్రేటర్ హైదరాబాద్‌లో ఎంత మేర కరెంట్ లోడ్ ఉందనే వివరాలను సిబ్బంది పక్కాగా తీసుకున్నారు. సిబ్బంది ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా కొన్నిచోట్ల ట్రిప్ అయి కరెంట్ సరఫరా నిలిచి పోతుండటంతో అధిక లోడ్ ఎక్కడ పడుతుంది..? ట్రిప్ కావడానికి కారణాలేంటనే అంశాలపై లోతుగా పరిశీలిస్తున్నారు. దీంతో ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి.. వాటి లోడ్ తదితర వివరాలను నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోనే దాదాపుగా పదివేల అపార్ట్‌మెంట్లు, భవనాల్లో కరెంట్‌లోడ్ 20 కిలోవాట్లకు మించి ఉన్నా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోనట్లు గుర్తించారు. దీనిపై చర్యలు చేపట్టిన డిస్కం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసింది. అపార్ట్‌మెంట్లలో సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలంటే సుమారుగా 3నుంచి 4 లక్షల రూపాయల ఖర్చువుతుంది. ఒక ఇంట్లో నాలుగైదు పోర్షన్లున్నా.. లేదా ఒక అపార్ట్‌మెంట్‌లో 20 కిలోవాట్ల కంటే లోడ్ ఎక్కువగా ఉన్నా..కచ్చితంగా ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలి.

**వినియోగదారులపై ఒత్తిడి..**

గ్రేటర్‌లో అధికారుల అంచనా ప్రకారం 20 కిలోవాట్లపైన లోడ్ పడుతున్న పదివేల భవనాలు, అపార్ట్‌మెంట్లలో ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టుకోవాలంటే సుమారుగా రూ. 300 కోట్లు ఖర్చువుతుంది. ఈ విషయంలో రెండు నెలల కిందట వరకు నోటీసులు జారీ చేయగా.. మధ్యలో యజమానుల నుంచి వచ్చిన వ్యతిరేకత కారణంగా టీజీఎస్పీడీసీఎల్ అధికారులు వెనక్కి తగ్గారు. మరోవైపు కొన్ని సర్కిళ్ల పరిధిలో పలుచోట్ల వినియోగదారులు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడంతో పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడి పెరిగి కరెంట్ ట్రిప్ కావడం లేదా కాలిపోవడం జరుగుతున్నదని సిబ్బంది చెబుతున్నారు. లోడ్ ఎక్కువగా ఉన్నచోట ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయించే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. విద్యుత్ సిబ్బంది చాలాచోట్ల వినియోగదారులను సంప్రదించి వారితో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై మాట్లాడుతూనే కొంతమేరకు ఒత్తిడి పెంచుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఒకవేళ లోడ్ పెరిగితే తామేం చేయలేమని, కరెంట్ సరఫరా నిలిచిపోతే తమ బాధ్యత కాదంటున్నారని కొందరు వినియోగదారులు చెబుతున్నారు.

**లోడ్ పెరుగుతోంది..**

గ్రేటర్‌లో విద్యుత్ కనెక్షన్లు గణనీయంగా పెరిగాయి. గతేడాది సుమారు 2 లక్షల మేర కొత్త కనెక్షన్లు ఇచ్చినట్లు టీజీఎస్పీడీసీఎల్ చెబుతున్నది. ఇప్పటికే వినియోగంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వెళ్లే ఎల్‌టీ లైన్ల నుంచే కొత్త కనెక్షన్లు ఇస్తున్నారు. దీంతో అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పెరుగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ శాఖే లోడ్‌ను పరిగణనలోకి తీసుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆ విషయాన్ని మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా వినియోగదారులపై ఒత్తిడి పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తగా నిర్మాణాలు చేస్తున్న చోట ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును తప్పనిసరిగా చేస్తూనే పాత అపార్ట్‌మెంట్లలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటునూ తప్పనిసరి చేసే ఆలోచనలో ఎస్పీడీసీఎల్ ఉంది. రాబోయే రోజుల్లో పెరిగే డిమాండ్, అధిక లోడ్ కారణంగా సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడవద్దంటే వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ అధికారులు కోరుతున్నారు. తమ వద్ద ఉన్న డేటా ప్రకారం కొన్ని ప్రాంతాల్లో అధికలోడ్ ఉన్నట్లు గుర్తించామని, వారికి గతంలోనే నోటీసులు ఇచ్చామని, ఇప్పుడు ఫాలోఅప్ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.



బల్దియాలో అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు

# బల్దియాలో నిరసన గళం

### కమిషనర్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల బైఠాయింపు

**సీఎం, మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు**

**దాడి చేసిన కాంగ్రెస్ సభ్యులపై చర్యలకు డిమాండ్**

**అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేత**

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్ బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్లు తమ నిరసన గళాన్ని ఉధృతం చేశారు..ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వ వైఖరిపై ప్రజాక్షేత్రంలో పోరాడుతున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను అణగదొక్కే విధంగా గురువారం పాలకమండలిలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు వ్యవహరించిన తీరును నిరసిస్తూ శుక్రవారం ఉదయం బల్దియా కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రధాన కార్యాలయం గేటు వద్ద నిల్చొని సీఎం రేవంత్‌రెడ్డి, మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. మహిళా కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు చేసిన దాడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ చాంబర్, అక్కడి నుంచి మేయర్ చాంబర్ వద్ద తమ నిరసన ప్రదర్శన చేపట్టారు. కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు సిద్ధపడగా..కమిషనర్ అందుబాటులోకి లేకపోవడంతో కొద్ది సేపు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అడిషనల్ కమిషనర్ శివ ప్రసాద్ నాయుడు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను కమిషనర్ కార్యాలయంలోకి పిలుచుకుని వారితో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి చర్చ లేకుండా జీహెచ్‌ఎంసీ బడ్జెట్‌ను ఆమోదించారని, బీఆర్‌ఎస్ మహిళా కార్పొరేటర్లపై కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా దాడులు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కార్పొరేటర్లు మన్నె కవితా రెడ్డి, సామల హేమ, ఆర్ సునీత, సింధూ ఆదర్శ రెడ్డి, శాంతిరెడ్డి, దేదీప్య రావులతో కూడిన కార్పొరేటర్ల బృందం ఈ సందర్భంగా శివ ప్రసాద్ నాయుడికి వినతి పత్రం సమర్పించింది.. బీఆర్‌ఎస్ మహిళా కార్పొరేటర్లపై కాంగ్రెస్ కార్పొరేటర్లు దాడులు చేస్తే మేయర్ కనీసం ఖండించడం లేదని బాలానగర్ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి మండిపడ్డారు. బీసీ మహిళగా గౌరవించి కేసీఆర్ మేయర్ పదవి ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. తోటి మహిళా సభ్యులపై దాడి చేసిన సాటి మహిళగా ఖండించాల్సిన మేయర్ తీరు బాధాకరమని ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. 'కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు పోడియం ముందుకు వెళ్లి బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల దగ్గర ఉన్న ప్లకార్డులను గుంజుకొని మేయర్‌పై విసిరి మా మీద నెట్టే ప్రయత్నం చేశారు..మమ్మల్ని అరెస్టు చేయించి రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించిన తీరును దుర్మార్గం' అని కార్పొరేటర్లు సామల హేమ, ఆర్ సునీత అన్నారు. ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ వర్గం సంతృప్తిగా లేదని మరో కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి 420 రోజులు అయినా కూడా ఒక్క గ్యారంటీని సక్రమంగా అమలు చేయలేదని కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ విమర్శించారు. ప్రతి రోజూ కొత్త వేషంతో ప్రజలను మభ్యపెడుతూ రేవంత్ రెడ్డి రాష్ట్రంలో తిరుగుతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని, ప్రజా క్షేత్రంలో ప్రభుత్వ లోపాలను ఎండగడతామని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు హెచ్చరించారు.



నల్లకుంట శంకరమఠం కూరగాయల మార్కెట్‌లో దుకాణాల కూల్చివేత

## రోడ్డున పడేశారు..

అంబర్‌పేట: శంకరమఠం కూరగాయల మార్కెట్‌లో రోడ్డును ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారంటూ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మొత్తం కూరగాయల దుకాణాలను జేసీబీలను పెట్టి తొలగించారు. 80 ఏండ్ల కింద ఏర్పాటైన ఈ కూరగాయల మార్కెట్‌ను పూర్తిగా తొలగించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ బతుకులను రోడ్డు పాలు చేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

**100 మంది వ్యాపారులు..**

శేరిలింగంపల్లి: నానక్‌రాంగూడ ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపుతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయంటూ.. సుమారు 100 మంది వీధి వ్యాపారులు స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అధ్వర్యంలో శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో డీసీ ముకుంద్‌రెడ్డిని కలిశారు. తమకు వెంటనే న్యాయం చేయాలని, తమకు ప్రత్యామ్నాయం కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


గోషామహల్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

## అరెస్టులు.. నిరసనల మధ్య..
# ఉస్మానియా శంకుస్థాపన

**గోషామహల్‌ను అష్టదిగ్బంధం చేసిన పోలీసులు**

అబిడ్స్/సుల్తాన్‌బజార్: గోషామహల్‌ను పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. స్థానికుల నిరసనలు.. వివిధ పార్టీల నాయకుల ముందస్తు అరెస్టుల మధ్య శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేసి వెళ్లారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు గోషామహల్ పరిరక్షణ సమితితో పాటు వివిధ పార్టీల నాయకులు శత విధాలా ప్రయత్నం చేసినా.. పోలీసులు మాత్రం ముందస్తు అరెస్టులు చేసి కార్యక్రమాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు.

**ముందస్తు అరెస్టులు..**

ఉస్మానియా దవాఖాన శంఖుస్థాపన సందర్భంగా పోలీసులు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, ఆశిష్ కుమార్ యాదవ్, సురేశ్ ముదిరాజ్‌లతో పాటు పలువురు బీజేపీ నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వివిధ పార్టీల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి.. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా, అరెస్టులకు భయపడేది లేదని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, ఆశిష్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టులు చేసి.. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన నూతన భవనాన్ని నిర్మించడాన్ని చూస్తూ ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు.




ప్లకార్డులతో నిరసన తెలుపుతూ..


నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## పారబోస్తే...ఫైన్

సిటీబ్యూరో: నిర్మాణాలు చేపట్టే సమయంలో కానీ, ఇంటి మరమ్మతులు, ఆధునీకరణ చేసే సమయంలో వచ్చే వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సీ అండ్ డీ (కన్‌స్ట్రక్చన్స్ అండ్ డీమాలిషన్) ప్లాంట్లకు అప్పగించకుండా కొందరు ఖాళీ స్థలాలు, చెరువులు, నాలాల పక్కన పడేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా.. గుట్టలు, గుట్టలుగా భవన వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బల్దియా టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గడిచిన నెల రోజులుగా వ్యర్థాలను డంపింగ్ వేస్తున్న 1158 డెబ్రీస్ పాయింట్లను గుర్తించారు. తరచూ వేస్తున్న దాదాపు 762 పాయింట్లను గుర్తించి సంబంధిత డంపింగ్ చేస్తున్న వారికి జరిమానాలు విధించారు. గడిచిన 28 రోజుల వ్యవధిలో రూ.42.20 లక్షల మేర జరిమానాలు విధించినట్లు అధికారులు పేర్కొన్నారు.



# 9999కు ఏమైంది..?

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : ఎప్పుడైనా 9999 నంబర్ అత్యధిక ధర పలికి హవా సృష్టించేది. కానీ ఈ ఏడాది ప్రారంభ నంబర్ ప్రక్రియలో 9999 రెండు సార్లు రెండో స్థానానికి పడిపోయింది. గతంలో ఆన్‌లైన్ నంబర్ల బిడ్డింగ్‌లో 9999ను సొంతం చేసుకోవడానికి వాహనదారులు పోటీ పడేవాళ్లు. ఈ సారి ఆ నంబర్ అత్యంత తక్కువ ధర పలకడం అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది. తాజాగా శుక్రవారం జరిగిన ఆన్‌లైన్ ఫ్యాన్సీ బిడ్డింగ్ వేలంలో 9999 నంబర్ కేవలం రూ.6.26 లక్షల ధర మాత్రమే పలికింది. ఈ నంబర్‌ను ఎటర్నల్ ఎవెన్యూ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ సొంతం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. 9999 నంబర్ కంటే 0009 నంబర్ ధర అధికంగా పలికింది. అత్యధికంగా రూ.10.46 లక్షలకు వెంకటేశ్ గౌడ్ అనే వ్యక్తి దక్కించుకున్నట్టు అధికారులు చెప్పారు. ఇటీవల జరిగిన వేలంలోనూ టీజీ 09 సీ 9999 నంబర్ రూ.7.19లక్షల ధర మాత్రమే పలికింది. ఈ నంబర్‌ను శ్రియాన్ కన్‌స్ట్రక్షన్ కైవసం చేసుకున్నది. 0001 నంబర్‌ను రూ.4.69లక్షలకు శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి కైవసం చేసుకున్నారు. 0005 నంబర్ రూ. 2.43 లక్షలకు కారా కౌన్సిల్ లిమిటెడ్ దక్కించుకున్నట్టు ఆర్టీఏ అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది నుంచి ఫ్యాన్సీ నంబర్ల వేలం ధరలు పడిపోతుండటం పలు అనుమానాలకు తావిస్తున్నదని వాహనదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## సందడిగా నర్సరీ మేళా

సిటీ బ్యూరో/ ఖైరతాబాద్: నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన గ్రాండ్ నర్సరీ మేళా ఆకట్టుకుంటున్నది. భిన్న రకాల మొక్కలు, విభిన్న రకాల పుష్ప జాతులు, ఔషధ, అరుదైన మొక్కలను అందుబాటులో ఉంచారు. సుమారు 150 స్టాళ్లలో ఏర్పాటు చేసిన మొక్కలను కొనుగోలు చేసేందుకు ప్రజలు బారులు తీరుతున్నారు. కాగా, గ్రాండ్ నర్సరీ మేళాలో 'స్నేహ నర్సరీ' ప్రదర్శించిన అరుదైన మొక్కలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. నర్సరీ మేళాలోని స్టాల్ నంబర్ 9లో విభిన్న రకాల మొక్కలను అందుబాటులో ఉంచామని స్నేహ నర్సరీ మేనేజింగ్ డైరెక్టర్ అనురాధ లక్కరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.






## ముత్తంగిలో హైడ్రా కూల్చివేతలు

**సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలో గాయత్రి కాలనీలో పార్క్ స్థలంలో అక్రమంగా నిర్మించారంటూ షెడ్డును హైడ్రా సిబ్బంది శుక్రవారం కూల్చేశారు. సర్వేనంబర్ 296లో ఏడుగుంటల పార్క్ స్థలంలో షెడ్డు నిర్మించారంటూ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన హైడ్రా.. అక్కడ అక్రమ నిర్మాణం జరిగిందంటూ తేల్చి షెడ్డును జేసీబీలతో తొలగించింది. - సిటీబ్యూరో/పటాన్‌చెరు, జనవరి 31(నమస్తే తెలంగాణ):**

## గ్రేటర్‌లో షురువైన ఎండలు

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో అప్పుడే ఎండలు షురువయ్యాయి. శుక్రవారం గరిష్ఠం 33.4, కనిష్ఠం 17.6డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 43శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.





**నిజాంపేటలోని సర్వేనంబర్ 334లోని ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో నిర్మాణాలను చేపడితే ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ అన్నారు.**

**-దుండిగల్, జనవరి31**